ప్రజాశక్తి

మంగళవారం 22 నవంబర్ 2022   8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

వాయు గండం

• వాతావరణంలో తీవ్ర మార్పులు • జల్లులు, చలిగాలులు • ఆందోళనలో రైతులు

ఉయ్యూరులో వరి పనలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమైంది. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్వల్పంగా వర్షపు జల్లులు పడ్డాయి. తీవ్ర చలిగాలులు వీచాయి. వాతావరణంలో మార్పులు రైతాంగాన్ని తీవ్రంగా కలవరపెట్టాయి. ఇప్పటికే గూడూరు, కంకిపాడు, పెనమలూరు, ఉంగుటూరు, తోట్లవల్లూరు, ఉయ్యూరు తదితర ప్రాంతాల్లో సాధారణ పద్ధతుల్లోనూ, యంత్రాల ద్వారా కోతలు ముమ్మరం అయ్యాయి. సాధారణ పద్ధతుల్లో కోతలు కోసి పనలకు వర్షం కురిసినా ధాన్యం నాణ్యత తగ్గే ప్రమాదం ఉంది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు ఏమాత్రం నాణ్యత తగ్గినా ధాన్యానికి మద్దతు ధర అందక రైతులు నష్టపోతారు. యంత్రాలతో నూర్పిడి పూర్తయి తేమశాతం తగ్గించేందుకు ఆరబెట్టిన ధాన్యంపై రైతులు పరజాలను కప్పి సంరక్షించే పనిలో బీజీగా ఉన్నారు.

కృష్ణాజిల్లాలో 3.96 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగయింది. మరో 20 రోజుల్లో కోతలు పూర్తి కానున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరానికి 75 కిలోల బస్తాలు 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయి. ఈ క్రమంలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు ఆందోళన కలిగిస్తున్నాయి. 2019-20, 2020-21ల్లో వరుసగా రెండేళ్లపాటు కోతలకు ముందు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండాల కారణంగా కురిసిన అధిక వర్షాలకు ఆరగాలం కష్టపడి పండించిన వరి పంట నీటిపాలయ్యింది. నాణ్యత తగ్గడంతో రైతులు అయినకాడకు అమ్ముకోవాల్సి వచ్చింది. 2021-22 సీజన్‌లో అధిక వర్షాలకు దిగుబడులు 75 కిలోల బస్తాలు 23 నుంచి 28 వరకు మాత్రమే అయ్యాయి. దిగుబడులు తగ్గి నష్టపోయారు. ఈసీజన్‌లో పంట కోత దశకు వచ్చిన తరుణంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. వరి పంట కోతకు వచ్చిన దశలో భారీ వర్షాలు కురిసినా, ఈదురుగాలులు వీసినా పంట నేలవాలుతుంది. కొంత మేర పంటకు నష్టం వాటిల్లుతుంది. నేలవాలిన పంటలు కోతలు, కుప్పలు వేయాలన్నా ఖర్చులు ఎక్కువవుతాయి. ఎకరానికి 35 వేల వరకు పెట్టుబడులు పెట్టి కొద్ది రోజుల్లో పంట చేతికందుతుందనుకుంటున్న తరణంలో వాతావరణంలో మార్పులు రైతులకు తీవ్రంగా ఆందోళన కలిగిస్తున్నాయి.

క్రీడా మైదానాల ప్రైవేటీకరణపై నిరసన

• శాప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత • డివైఎఫ్ఐ నేతల అరెస్టు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: క్రీడా మైదానాల ప్రయివేటీకరణ ఆపాలని, పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం ముట్టడిలో ఉద్రిక్తత నెలకొంది. నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం వద్ద గల శాప్ కార్యాలయానికి సోమవారం ఉదయం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున యువత చేరుకున్నారు. దీంతో పోలీసులు శాప్ కార్యాలయం గేటును మూసివేసి డివైఎఫ్ఐ నాయకులను అడ్డుకున్నారు. అయినా శాప్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు విరుచుకుపడి నేతలను, కార్యకర్తలను అరెస్టు చేశారు. ఈ సమయంలో పోలీసులకు, డివైఎఫ్ఐ నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అనంతరం డివైఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈసందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాల్సిన శాప్ అధికారులు క్రీడాకారులతో ఆటలాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న క్రీడా మైదానాలను ప్రయివేటుపరం చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయాల్సిన బాధ్యత శాప్‌పై ఉందన్నారు. క్రీడాకారులకు ఉచితంగా (మిగతా 6లో)

అరెస్టయిన వారిని పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

అందరికీ విద్య, ఉపాధే డివైఎఫ్ఐ లక్ష్యం

... వార్త 3లో

ఫేస్ రీడింగ్ అటెండెన్స్ నుండి మినహాయించాలి

... వార్త 4లో

బీమా కంపెనీకి జరిమానా

పంటల బీమా సొమ్ము 9 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కష్ణా) : పంటల బీమా సొమ్ము చెల్లించని ఐసిఐసిఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌కు, వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థకు జరిమానా విధిస్తూ కష్ణాజిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ చింతలపూడి కిషోర్ కుమార్, సభ్యులు నందిపాటి పద్మా రెడ్డి, లక్ష్మి రాయల సోమవారం ఉతర్వులు జారీ చేశారు. కందిమూల మహేష్ బాబు అనే వ్యక్తి....ప్రధాన మంత్రి ఫాసల్ బీమా యోజన కింద బీమా ప్రీమియం చెల్లించినా తనకు పంట నష్టం కింద బీమా సొమ్ము రాలేదని వెలుగు పీడీని, జిల్లా గ్రామీణాభివధి సంస్థను ఆశ్రయించారు. వారు ఐసిఐసిఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వారిని సంప్రదించగా, తమకు ఎటువంటి బీమా ప్రీమియం అందలేదని పేర్కొన్నారున. దీంతో ప్రీమియందారుడైన మహేష్‌బాబు వినియోగదారుల కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారాన్ని పరిశీలించిన కోర్టు బీమా కంపెనీకి రూ.10,888 జరిమానా విధించింది. అంతేగాక ప్రీమియందారునికి పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. అలాగే కేసు వేసినప్పటి నుండి అనగా 2018 ఆగస్టు 22 నుంచి ఏడాదికి 9 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశాల్లో పేర్కొంది. ప్రీమియందారుడిని మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.10 వేలు, ఇంకా కేసుకు పరిహారంగా మరో రూ.5 వేలు చెల్లించాలని వినియోగదారుల కోర్టు ఆదేశించింది.

సిఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ డిల్లీరావు

బందరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

మత్స్య సంపద పెంపు అందరి బాధ్యత

• ఫిష్ రిటైల్ అవుట్లెట్లకు ఆర్థిక సాయం
• ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు డిల్లీరావు, రంజిత్ బాషా

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : పర్యావరణాన్ని కాపాడడంతోపాటు మత్స్య సంపదను పెంచుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు ఎస్.డిల్లీరావు, పి.రంజిత్ బాషా అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న జాతీయ మత్స్య దినోత్సవ కార్యక్రమాన్ని నగరంలోని కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి ఎన్‌టిఆర్ జిల్లా మత్స్యకారులతో కలిసి కలెక్టర్ డిల్లీరావు వీక్షించారు. అలాగే మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించిన ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విజయవాడలో కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఫిష్ రిటైల్ అవుట్లెట్లు, మార్కెటింగ్ హబ్‌లు, ఫిష్ కియోస్కా, ఐస్‌బాక్సులతో కూడిన టూవీలర్, త్రీ వీలర్ మోటర్ సైకిళ్ల పంపిణీ, (మిగతా 6లో)

ప్రభుత్వాస్పత్రిలో వెలగని వీధిలైట్లు

ప్రజాశక్తి -మైలవరం : మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వీధిలైట్లు వెలగకపోవడంతో అంధకారం అలుముకుంది. ప్రధాన రహదారి గేటు నుండి ఆసుపత్రి వరకు ఉన్న మూడు వీధిలైట్లు వెలగక ప్రభుత్వ ఆసుపత్రిలోని వచ్చే వివిధ రకాల వ్యాధిగ్రస్తులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.30 పడకల ఆసుపత్రి అయిన ఈ ప్రభుత్వాసుపత్రికి మైలవరంతో పాటు ఏ.కొండూరు, జి.కొండూరు,రెడ్డిగూడెం మండలాల నుండి నిత్యం వందలాది మంది రోగులు వస్తుంటారు. వ్యాధిని బట్టి రోగితో పాటు వారి బంధువులు కూడా ఆసుపత్రిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.అయితే రాత్రి సమయంలో ఆస్పత్రి ఆవరణలో ఉన్నటువంటి లైట్లు వెలగకపోవటంతో రెండు పర్లాంగుల దూరం చీకట్లో వెళ్లాల్సి వస్తుంది దీంతో విశాలర్పాలు సంచరిస్తుండటంతో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు స్పందించి ఇప్పటికైనా లైట్లను మరమ్మత్తులు చేయాలని పలువురు కోరుతున్నారు.

వీధిలైట్లు వెలగకపోవడంతో చీకటిగా ఉన్న ఆస్పత్రి ప్రాంగణం

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ 8వ వార్డు బ్యాంక్ సెంటర్ కళ్యాణ మండపం రోడ్డులో నివసిస్తున్న అరఫ్ నాగిన దంపతుల కొడుకు అష్రాఫ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. కనీసం ఆసుపత్రిలో బిల్ కట్టడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న కాంట్రాక్టర్ బొలియశెట్టి శ్రీకాంత్ వెంటన్ హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ తన తోటి కాంట్రాక్టర్లకు సమాచారం అందించారు. రాజు శ్రీకాంత్ శ్రీనివాసరావు బిప ప్రసాద్ మల్లిఖార్జునరావులు కలిసి రూ.12వేలు అనారోగ్యంతో బాధ పడుతున్న బాబుకి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా అరఫ్ కుటుంబసభ్యులు సహాయం అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-నందిగామ : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి ఈ నెల 22వ బందరు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ట్రెజరర్ మహేశ్వర వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో సకాలంలో డిఏలు, పిఆర్సీలు ఇస్తామని అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల తమ ఖాతాల్లోని పిఎఫ్ లోన్లు, పార్ట్ పేమెంట్లు, ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఏ.పీ. జి .ఎల్ .ఐ ఫైనల్ క్లైములు, లోన్లు నెలలు తరబడి విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేయటం జరుగుతుందని తెలిపారు. పిఆర్సి బకాయిలు, డి .ఎ ఎరియర్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాకు ఉపాధ్యాయులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'స్పందన'కు మూడు అర్జీలు

ప్రజాశక్తి - గంపలగూడెం : సోమవారం నాడు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మూడు అర్జీలు వచ్చినట్లు తహసిల్దార్ జి బాలకష్టారెడ్డి తెలిపారు. వద్ధాప్య పెన్షన్, వితంతు పింఛన్, మరొకటి భూ సమస్యపై అర్జీలు వచ్చినట్లు ఆయన వివరించారు

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని తక్కెళ్ళ పాడు గ్రామానికి చెందిన ఆదిమళ్ళ ఆదం అనే కౌలు రైతు ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులు కార ణంగా మరణించాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు తక్కెళ్ళపాడు గ్రామంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వవిప్, సామినేని ఉదయభాను దష్టికి తీసుకువచ్చారు. దీనితో వెంటనే స్పందించిన ఉదయభాను వారికి హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను కృషితో ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించిన 7 లక్షల రూపాయలు చెక్కును మంగళవారం లబ్దిదా రునికి అందించారు.

అన్నాక్యాంటీన్‌కు నగదు వితరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని జయంతిపురం గ్రామానికి చెందిన యడ్లపల్లి శ్రీనివాస్ రావు జగ్గయ్యపేటలో అన్న క్యాంటీన్ కు కందివప్పు కొరకు 50,000 రూపాయలు వితరణగా సోమవారం తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ ద్వారా మైనేని రాధ కి అందజేశారు. అన్నా క్యాంటీన్ ద్వారా నిరుపేదల ఆకలి తీర్చడం కోసం భాగస్వాములు అవుతున్నందుకు సంతోషంగా ఉందని దాత శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో యడ్లపల్లి పట్టాభి, పద్మనాభుని కుటుంబరావు, నూకల బాలకష్ణ, కేశి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న అధికార బృందం

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును సోమవారం రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో సోమవారం నుండి మారిన మధ్యాహ్న భోజన మోనూను ప్రభుత్వ నిబంధనల మేరకు అమలును పర్యవేక్షించారు. ఇందులో భాగంగా బియ్యం, గుడ్లు, చిక్కిల స్టోరేజీ పాయింట్లను పరిశీలించారు. వంట చేసే ప్రాంగణాన్ని ఎమ్‌డిఎమ్ నాణ్యతను రుచి చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం విద్యార్థుల మరుగు దొడ్లను పరిశీలించారు. ఈ బృందంలో ఎమ్‌డిఎమ్ ఏడి కె వేణుగోపాల్ నందిగామ ఉపవిద్యాశాఖాధికారి బి గౌరి శంకర్ ఉన్నారు. ఇంకా డిఇఈవో రికార్డు అసిస్టెంట్ రాజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యంవి శేషగిరిరావు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ జగ్గయ్యపేట లైం స్టోన్ యూనిట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సెంట్రల్ కమిటీ నాయకులు సోమవారం ప్రకటించారు. అధ్యక్షులుగా వి. రామచంద్రనాయక్, కార్యదర్శిగా డి విజయ కుమార్, ఉపాధ్యక్షులుగా ఏం సురేష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ గా డి రవితేజ, విక్రమ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జి ఎస్ డి ప్రసాద్ బాబు, ఎల్ దేవుజీ, జాయింట్ సెక్రటరీగాలుగా అమత రావు, జూలీస్, సురేంద్రనాయక్, ట్రెజరర్ మరియు జాయింట్ ట్రెజరర్ గా నవీన్ కుమార్, భాస్కర్ లు నియమితులయ్యారు. నూతన కార్యవర్గాన్ని స్టీల్ ప్లాంట్ ఇంచార్జ్ బి యూ వి రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా బి యూ వి రాజు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కమిటీ సభ్యులను అభినందించారు.

25 మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 25 న శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తు న్నట్లు ఇన్చార్జి ఎంపీడీవో కె బాల శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యంపిపి షేక్ మలక్ బషీర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి హాజరవుతారన్నారు. మండలంలోని యంపిటిసిలు, సర్పంచ్‌లు, ఆయా శాఖలు అధికారులు హాజరు కావాలన్నారు.

ప్రశ్నాపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-చందర్లపాడు

చందర్లపాడు మండల స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు సోమవారం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చందర్లపాడు ప్రధానోపాధ్యాయులు కె.రఘునాథ్ ప్రసాద్ ప్రశ్న పత్రాలను విడుదలచేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానాన్ని పెంచటానికి, మూఢనమ్మకాలనుంచి విముక్తి చేయడానికి జనవిజ్ఞానవేదిక ఎంతో కాలం నుంచి కషి చేస్తూ విద్యార్థుల్లో సైన్సు పట్ల ఆసక్తిని పెంచుతున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ఐ.సత్యం,చందర్లపాడు మండల జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ గంగరాజు పాల్గొన్నారు.

గడపగడపకూ మనప్రభుత్వం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని 13వ సచివాలయం 28వ వార్డు ఎర్రకాలువ కట్ట నుండి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శాసనసభ్యులు సామినేని ఉదయభాను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పట్టణ అభివద్ధికి మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో కషి చేస్తున్నారని, గతంలో ఎన్నడూ చేయని విధంగా ఒక్కో సచివాలయానికి 20 లక్షల రూపాయలు కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : గ్రంథాలయాలు జ్ఞాన బాండాగారా లాని రెడ్డిగూడెం మండల పరిషత్ ఉపాధ్యక్షులు చాట్ల రాబర్ట్ అన్నారు. రెడ్డిగూడెం మండల కేంద్రంలో గల గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేసి వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తగిన మెటీరియల్ అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. కనుక ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను ఉపయోగించు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం



సర్పంచ్ మల్లాది రాణి, మాజీ సర్పంచ్ జానాలపాటి వేణుగోపాల్ రెడ్డి, టిడిపి యువ నాయకులు పైడిమర్ల కిరణ్ కుమార్ రెడ్డి, గ్రంథాలయ అధికారి తెనాలి వెంకటేశ్వర్లు, కొండపల్లి భాస్కరరావు, ఖాసీం పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు ప్రభుత్వం ప్రాధాన్యం : డిప్యూటీ స్పీకర్



ప్రజాశక్తి -నందిగామ : ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగోట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. నందిగామ పట్టణ శివారులో గల మామిడి తోటలో ఆర్యవైశ్య బాల భక్త సమాజం ఆధ్వర్యంలో 102 వ ఆర్యవైశ్యుల కార్తీక వన సమారాధన మహోత్సవాన్ని సోమ వారం నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ నందిగామ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గా ఆర్యవైశ్యులకు అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. నంది గామలో ఆర్యవైశ్య ప్రముఖులు పొట్టి శ్రీరాములు , కొణిజేటి రోశయ్య ల విగ్రహాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. సభానంతరం ముఖ్య అతిథులకు చేసిన ప్రముఖులకు ఆర్యవైశ్య బాలభక్త సమాజం వారు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాస్, మద్దాలి గిరి, సినీ నటి కవిత, ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, నందిగామ మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట మాజీ ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ పోతుల సురేష్ , గిరీష్ కుమార్ సంఘీ, పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు .

అందరికీ విద్య, ఉపాధే డివైఎఫ్ఐ లక్ష్యం

ప్రజాశక్తి - కంకిపాడు

కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వనుకురు రమేష్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి. రామన్న జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ అందరికీ విద్య, అందరికీ ఉపాధి డివైఎఫ్ఐ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనకై డివైఎఫ్ఐ పనిచేస్తుందని అన్నారు. సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం సంస్థలన్నిటినీ అంబానీ, ఆదానీలకు దారా దత్తం చేస్తున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వంలో నిరుద్యోగ యువత బాగా పెరిగిందని దుయ్యబట్టారు. సుమారు 8 లక్షల ఉద్యోగాలకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంలేదని విమర్శించారు. డివైఎఫ్ఐ మాజీ నాయకుడు చిక్కవరపు రెడ్డయ్య మాట్లాడుతూ గతంలో ఉప్పులూరు గ్రామంలో బుడమేరు పొంగినప్పుడు పలు సేవా కార్యక్రమాలు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేశామని అన్నారు. మండల గౌరవ అధ్యక్షులు డివైఎఫ్ఐ నాయకులు తాడింకి నరేష్ మాట్లాడుతూ నేడు రాజకీయ లబ్ది కోసం రాజకీయ నాయకులు సంక్రాంతి పండుగకి దగ్గర ఉండి కోడిపందాలు పేకాట జూద క్రీడలు ఆడిస్తున్నారని ఈ విధానాలు యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయని అన్నారు. యువత జూద క్రీడలకు అలవాటు పడి ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ లో పాల్గొంటూ అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుం టున్నారని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా పెనుమత్స జ్యోతి బస్, ప్రధాన కార్యదర్శిగా దేవరపల్లి పథ్వి, ఉపాధ్యక్షులుగా విజయ్, శివరామకృష్ణ, సువర్ణ రాజు, సహాయ కార్యదర్శిగా సుబ్రహ్మాణ్యం, నవీన్, భాషా, సాయికుమార్, గౌరవ అధ్యక్షులు ఈ చిక్కవరపు శ్రీహరి, కమిటీ సభ్యులుగా డేవిడ్ రాజు, శశిధర్, ఆంజనేయులు, కన్న జోజి, సాయికష్ణ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కష్ణా జిల్లా కన్వీనర్ బాజీ బాబు తెల్లాకుల గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ సుబ్రమణ్యం

రేపు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ కృష్ణాజిల్లా రెండో మహాసభ

గుడివాడ : ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కష్ణా జిల్లా మహాసభ ఈనెల 23వ తేదీన జరుగుతుందని జిల్లా కన్వీనర్ బి సుబ్రహ్మాణ్యం తెలిపారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్జీవో హెూంలో జరిగే ఈ మహాసభకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. కృష్ణాజిల్లా రెండవ మహాసభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ధనాల సత్యనారాయణలు పాల్గొన్నారు.

రేపు ఇంటి పని వారి సంఘం 2వ జిల్లా మహాసభ

ఇంటి పనివార్ల సంఘం కృష్ణా జిల్లా రెండవ మహాసభ ఈ నెల 23వ తేదీన జరగనున్నట్లు కన్వీనర్ కే చిన్న శాంతి సోమవారం తెలిపారు. గుడివాడలో స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగే ఈ జిల్లా మహాసభకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే స్వరూపరాణి హాజరవుతారని అందరూ తప్పక విచ్చేసి సభను జయప్రదం చేయాలని ఆమె కోరారు.

వర్షంతో రైతులు దిగాలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొస్తున్న తరుణంలో అకాల వర్షంతో రైతులు గుండె గుబేలు మంటోంది. మండల పరిధిలో పలు గ్రామాల్లో వరి కోతలు ప్రారంభించిన సమయంలో వాయుగుండ ప్రభావంతో సోమవారం తెల్లవారు జామునుంచి వర్షపు జల్లులు పడుతూ ఉన్న నేపథ్యంలో రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. కొన్ని చోట్ల కూలీలతో కోతకోయించి వరిపనలు పొలాల్లో ఉండగా మరి కొన్ని చోట్ల మెషిన్తో కోయించి ధాన్యం రోడ్లపక్క ఖాళీ ప్రదేశాల్లో ఆరెబెట్టారు. ఈపరిస్థితుల్లో పొలాల్లో పనలపై ఉన్న వరి పంట తడిసిపోగా ఆరబెట్టిన ధాన్యం తడవకుండా పట్టాలు కప్పి రైతులు నానా తంటాలు పడుతున్నారు. కోతకోసి రెండవ పంటగా మినుము విత నాలు చల్లిన పొలాల్లో నీరు నిలిస్తే విత్తనాలు మొలక రాకుండా కుళ్లిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో ఒకటి రెండు రోజులు వర్షాలు కురిచే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. వర్షం పెరిగితే పల్లపు ప్రాంతాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి మొలకలు వచ్చే ప్రమాద0 ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వరి పంట కోసిన దృశ్యం

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం మండలం తాళ్ళ పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని మధ్యాహ్న భోజన తనిఖీ అధికారి ఎంఎ అజీజ్, మండల విద్యా శాఖాధికారి ఎం వి ఎస్ దుర్గా ప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథక నూతన మెనూ అమలు తీరును పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల టాయిలెట్స్ ను పరిశీలించి నిర్వహణ తీరుపై సంతప్తి వ్యక్తం చేశారు. నాడు నేడు ఫేజ్ –2 కింద అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆటవిక ప్రభుత్వం : ఎమ్మెల్సీ బచ్చుల

ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు)

గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు గ్రామంలో గ్రామ చైతన్య కార్యక్రమం సోమవారం ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అర్జునుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటవిక ప్రభుత్వం పరిపా లిస్తుందని అన్నారు. ఎలక్షన్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్ర ప్రదేశ్ ా చేసిన ఘనత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆరుమళ్ళ వెంకటకష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘంటసాల ఎస్ఐగా శ్రీనివాస్

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మండల ఎస్ఐగా కుడిపూడి శ్రీనివాస్ సోమవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. పోలీసు స్టేషన్‌లో నూతన బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగాయలంక ఎస్ఐగా ఇటీవలి వరకు బాధ్యతలు నిర్వహించిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఘంటసాల ఎస్ఐగా వచ్చారు. కరోనా కష్టకాలంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి నాగాయలంక మండల ప్రజల మన్ననలు చూరగొని ఘంటసాలకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ శ్రీనివాస్‌ను స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

త్రీ వీలర్ వాహనాలివ్వాలని వినతి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో అర్హత కలిగిన నడవలేని దివ్యాంగులందరికి త్రీవీలర్ మోటార్ వెహికల్స్ ఇవ్వాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కృష్ణాజిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు జన్ను లక్ష్మణ్ , ఎన్ ఎస్ నారాయణ లు సోమవారం బందర్ ఆర్‌డిఓ ఐ.కిషోర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రభుత్వం వారు నడవలేని దివ్యాంగులకు త్రీవీలర్ మోటార్ వెహికల్స్ ఇస్తామని అప్లై చేసుకోవాలని నోటిఫికేషన్ ఇచ్చారని దీంతో జిల్లాలో 250 మంది దివ్యాంగులు అప్లై చేసుకున్నారని కాని ప్రభుత్వం నియోజక వర్గానికి 10 వెహికల్స్ మాత్రమే ఇస్తామని చెప్పడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొందన్నారు . ఇలా అయితే జిల్లాకు 7 నియోజక వర్గాలకు కలిపి 70 మాత్రమే వస్తాయని. మిగిలిన అర్హత కలిగిన వారు అన్యాయం జరుగుతుందన్నారు. త్రీవీలర్ మోటార్ వెహికల్స్ వలన నడవలేని దివ్యాంగులు చాలా లబ్దిపొందుతున్నారని అలాగే చాలా ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. కావున దయచేసి అర్హత కలిగిన దివ్యాంగులందరికీ త్రీవీలర్ మోటార్ వెహికల్స్ ఇచ్చి నడవలేని దివ్యాంగులను ఆదుకోవాలని కోరారు.

క్షౌర వత్తి లోకి బహుళ జాతి సంస్థలను రాకుండా నిషేధించాలని వినతి

క్షౌర వత్తి లోకి రిలయన్స్ లాంటి బహుళ జాతి సంస్థలను రాకుండా ప్రభుత్వాలు నిషేధించాలని నాయిబ్రాహ్మణ సవితా సమాజం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు కు వినతిపత్రం అందజేశారు. నాయీ బ్రాహ్మణం తమ వృత్తి చేసుకొని జీవిస్తున్నామని, కానీ ఈమధ్య రిలయన్స్ కంపెని లాంటి బహుళ జాతి సంస్థలు క్షౌరవృత్తిలోకి వస్తున్నట్లు తెలుస్తుందని అన్నారు. ఇలాంటి వాటికి అనుమతులు ఇస్తే ఈ వత్తినే నమ్ముకుని జీవిస్తున్న వేలాది కుటుంబాలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి రిలయన్స్, ఇతర బహుళ జాతి సంస్థలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా తగు చర్యలు తీసుకొన వలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘ నాయకులు రాయపుడి ప్రసాద్, చోడవరం శివకుమార్,తదితరులు ఉన్నారు.

న్యాయం చేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి- మచిలీపట్నంరూరల్

తాను సక్రమంగా పనిచేస్తున్నా తనను మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ నుంచి తొలగించారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ మచిలీపట్నం మండలం బుద్దాలపాలెం గ్రామ జడ్ పి హెచ్ పాఠశాలలో పనిచేస్తున్న కొక్కు మహాలక్ష్మి వేడుకున్నారు. ఈ మేరకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం స్పందన లో కలెక్టర్ కి, డీఈవో తాహెర సుల్తాన్ బేగం కి వినతిపత్రం అందజేశారు. తనను తొలగించాలని మాఊరు పంచాయతీ సర్పంచి తన మీద పై అధికారులకు ఫిర్యాదులు చేసి తొలగించారన్నారు. వెంటనే తనకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు కార్యదర్శి సిహెచ్ జయరావు పాల్గొన్నారు.

అధికారులిచ్చిన హామీ నెరవేర్చాలి

ప్రజాశక్తి-ఘంటసాల

యండకుదురు పంచాయతీ శివారు జీలగలగండి ఎస్సీ కాలనీలో పక్కా డ్రైనేజీ నిర్మిస్తామని ఎన్.హెచ్ అధికారులు ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలని కోరుతూ సోమవారం మచిలీపట్నంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు, విజయవాడలోని జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో యండకుదురు గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు వినతిపత్రాలను వేర్వేరుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముళ్లపూడి పట్టాభి రామారావు మాట్లాడుతూ జీలగలగండిలోని ఎస్సీ కాలనీ ఎదురుగా ఉన్న ఎన్.హెచ్ రహదారి ఎత్తుగా నిర్మాణం చేపట్టడం వల్ల డ్రైనేజీ నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఈ విషయమై ఎన్.హెచ్ అధికారులు ఏడాది క్రితం పక్కా డ్రైనేజీ నిర్మిస్తామని హామీ ఇచ్చి చేతులు దులుపుకున్నారని, తక్షణమే పక్కా డ్రైనేజీ నిర్మించాలని కోరారు. ఘంటసాల వచ్చే ఆర్ అండ్ బి రోడ్డుకు అప్రోచ్ వేయకుండా ఎన్.హెచ్ అధికారులు రహదారి పనులు ముగించేస్తున్నారని, ఐనంపూడి డ్రైన్ పైన ఉన్న పాత వంతెన వెంటనే తొలగించాలని, దానికి అనుకుని ఉన్న మంచినీటి పైపులైన్ కొత్త వంతెనకు ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించామని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు సిద్ధినేని కుమార్ రాజా, కోలపల్లి కిరణ్, ఆవుల మోహన కష్ణ, కొట్టి వెంకటేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు బహుమతులు

ప్రజాశక్తి-తిరువూరు: ఆర్‌టిసి లక్కీ డ్రా విజేతలకు బహుమతులను డిపో మేనేజర్ వేణు సోమవారం తిరువూరు బస్టాండ్‌లో అందజేశారు.

సురక్షిత ప్రయాణానికి ఎపిఎస్ ఆర్టీసీ ఒకటే మార్గమని మేనేజర్ అ న్నారు. మధిర రూట్లో ఎస్.శైలజకు తి రువూరు నుండి విజయవాడ రూట్‌లో కె.గోపీకి బహుమతులు వచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డిపో ఎస్‌టిఐ ఆశాజ్యోతి, సిబ్బంది ప్రయాణి కులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-వత్సవాయి: ౦ండలంలోని గోపినేనిపాలెం గ్రామంలో గ్రామ సచివాలయంలో 22వ తేదీన మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ సాయి సెంచరీ హై స్కూల్ కరెస్పాండెంట్, మరియు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరానికి చుట్టుపక్కల గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, ఒటర్ కార్డు తీసుకొని రావాలని తెలిపారు. కంటి ఆపరేషన్‌కు అవసరమైన వారిని గుర్తించి వారిని బస్సులో తీసుకెళ్లి ఆపరేషన్ చేసి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు.

కార్తీక దీపోత్సవం

ప్రజాశక్తి-వన్‌టౌన్: చిట్టినగర్ శ్రీ నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానంలోని శ్రీకాశీ విశ్వేశ్వర దేవస్థానంలో కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్వామివారి శాంతి శివ కళ్యాణ మహోత్సవం నిర్వహించేందుకు దేవస్థానం వారు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరిపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిపిఎం అభిమాని రంగా మృతి

ప్రజాశక్తి-విజయవాడ రూరల్ : మండలంలోని పి.నైనవరం గ్రామంలో సిపిఎం సానుభూతిపరుడు మరీదు రంగా (60)

సోమవారం గుండెపోటుతో మరణించారు. ఆయన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ప్రజాసమస్యలపై నిర్వహించిన అనేక పోరాటాలు, ఆందోళనల్లో పాల్గొన్నారు. రంగా మృతిపట్ల సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి మాతంగి ఆంజనేయులు, గ్రామ కమిటీల కార్యదర్శులు చట్టు శ్రీను, చప్పిడి రాంబాబు, ముగడ సురేష్, అజయ్, సురగాని బుజ్జి తదితరులు నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-నందిగామ: పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై కారు బైకును ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు స్పాట్ లో దుర్మరణం చెందగా, మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మతి చెందిన యువకుడు నందిగామ శివారు అనాసాగరం గ్రామానికి చెందిన కొనగాల రామ గోపీ (28),గా పోలీసులు గుర్తించారు. కాగా గాయపడిన వ్యక్తి ఇదే గ్రామానికి చెందిన రాఘవగా పోలీసులు తెలిపారు. మతుడుతో కలిసి రాఘవ ఈ రోజు సాయంత్రం 4 గంటల సమయంలో వరి పోటు కోసమే ద్విచక్ర వాహనం పై జగ్గయ్యపేట వెళ్ళారు. తిరిగి సుమారు 5.30 జగ్గయ్యపేట నుంచి బయలుదేరి నవాబుపేట క్రాస్ వద్దకు చేరుకున్న సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు బైక్ ను ఢీకొట్టినట్లు తెలుస్తోంది. సంఘటన స్థలంలోనే గోపీ మతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన విషయం తెలుసుకున్న పెనుగంచిప్రోలు ఎస్ఐ హరి ప్రసాద్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుణి కూడా ప్రాథమిక చికిత్స నిర్వహించి మైరుగైన వైద్యం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ప్రమాదం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరి ప్రసాద్ తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో వైద్యసేవలు చేరువ

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ

పేద ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అమలు జరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం అమలులో పిహెచ్‌సి స్థాయిలో ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తున్న వైద్యులను సోమవారం కలెక్టరేట్ పింగళివెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని 239 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. 67 రకాల మందులు అందుబాటులో ఉంచారని, 14 రకాల డయాగ్నస్టిక్ మెడికల్ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నెల రోజుల నుండి జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలలో ఉత్తమ సేవలు అందిస్తూ ముందంజలో ఉన్న ఇబ్రహీంపట్నం జూపూడి, రెడ్డిగూడెం మండలం రంగపురం, చంద్రాలలోని మైలవరం పిహెచ్‌సి-4, ఎ.కొండూరు మండలం కోడూరు, జి.కొండూరు మండలం చెరువు, మాదవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వర్తిస్తున్న సుధాప్రసూజ, సందేష్, నరేష్, దివిజ, కార్తీక్‌లను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో కె.మోహన్‌కుమార్, ట్రైనీ డిప్యూటి కలెక్టర్లు ఎస్.రామలక్ష్మి, ఖతీఫ్ కౌసర్ బానో, డియంహెచ్‌వో డాక్టర్ యం.సుహాసిని, డిప్యూటి డియంహెచ్‌వో నళినిదేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ సుమన్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

క్షయ వ్యాధిని సమూలంగా నివారించి క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ప్రధాన మంత్రి టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నివారణ కొరకు నిర్వహిస్తున్న ని-క్షయ్ మిత్రల ఏర్పాట్లపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ, టిబి కంట్రోల్ అధికారులు, ఇండియ రెడ్‌క్రాస్ సోసైటీ వివిధ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా కోవిడ్ వ్యాధి వల్ల ప్రజలలో రోగనిరోధక శక్తి తగడం వల్ల టిబి కేసులు బయటపడుతున్నాయన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి ని-క్షయ్ మిత్రలు వారిని దత్తత తీసుకుని ఆరోగ్యవంతమైన పౌష్టికహారాన్ని అందిస్తే వ్యాధిని రూపుమాపేందుకు అవకాశం వుంటుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రెండు వేల మంది క్షయ వ్యాధి బారిన పడినట్లు వైద్య అధికారుల నివేదికలు తెలియజేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా టిబి కంట్రోల్ అధికారి డాక్టర్ ఉషారాణి, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జి.సమరం, డిఆర్‌వో కె.మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిటిజన్ సర్వేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న వసతులపై నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేసి, జాతీయ స్థాయిలో మొదటిస్థానం వచ్చే విధంగా సహకరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ప్రాజెక్టు) కెవి సత్యవతి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సిటిజెన్ పర్సెప్షన్ సర్వేలో భాగంగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, సోమవారం రాజీవ్ గాంధీ పార్కులో హిజ్రాలతో మమేకమయ్యే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసి ప్రాజెక్టు సత్యవతి మాట్లాడుతూ... హిజ్రాలను వివక్షతో చూడకూడదన్నారు. సమాజంలో అందరితో సమానమనే ఉద్దేశంతో వారితో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. హిజ్రాలతో కలసి ఈజీ ఆఫ్ లివింగ్ ఇండెక్స్-22 ,కేంద్ర ప్రభుత్వం గహకల్ప, పట్టణాభివద్ధి శాఖ ఆధ్వర్యంలో దేశంలోని నగరాల్లో జీవన ప్రమాణాలు, సుస్థిరమైన వసతులు, ఆర్థిక వనరులపై సిటిజన్ పర్సెప్షన్ సర్వే చేస్తుందని అన్నారు. ఈ సర్వేలో నగరంలో అందిస్తున్న వసతులపై ప్రశ్నావళి ఉంటుందని నగర వాసులందరూ ఈ సర్వేలో పాల్గొని జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచేలా సహకరించాలన్నారు. ఈ సందర్భంగా 2022 (ఈజీ ఆఫ్ లివింగ్ ఇండెక్స్-2022) బ్రోచర్స్ ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించినప్పుడే 'స్పందన'పై నమ్మకం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజలకు నమ్మకం కలిగేలా స్పందనలో అర్జీదార్ల సమస్యను పూర్తిగా విని అర్థం చేసుకుని పరిష్కరించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. స్థానిక పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీ దారులనుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి అర్జీదార్లు తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో స్పందనను ఆశ్రయిస్తారన్నారు. అర్జీని స్వీకరించి రశీదు ఇచ్చినంత మాత్రన సమస్యలు పరిష్కారం కావని, సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి తగు న్యాయం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన మంచి ఫలితాలను ఇస్తుందని, దాదాపు 50 శాతం పైగా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగలుగుతున్నామని అన్నారు. స్పందన పోర్టల్లో గడువు తీరిన అర్జీలు ఉండరాదన్నారు. 48 గంటలలో పరిష్కరించాల్సిన వాటిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో అధికారులు స్పందన ఆర్జీలపై పరిష్కారం చూపకపోవడంతో అధికస్థాయిలో అర్జీలు పునరావృతం అవుతున్నాయన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. స్పందనలో 85 వినతులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్, డిఆర్‌వో కె.మోహన్‌కుమార్, అసిస్టెంట్ డిప్యూటి కలెక్టర్లు ఎస్.రామలక్ష్మి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫేస్ రీడింగ్ అటెండెన్స్ నుండి మినహాయించాలి

జిల్లా వైద్యాధికారికి ఆశా వర్కర్ల వినతి

వినతిపత్రం అందిస్తున్న కమల తదితరులు

ప్రజాశక్తి-విజయవాడ: ఆశా వర్కర్లకు ఫేస్ రీడింగ్ అటెండెన్స్ నుండి మినహాయించాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా వైద్యాధికారి (డిఎంఅండ్‌హెచ్‌ఒ) డాక్టర్ ఎం సుహాసినీకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని గర్భవతులకు, బాలింతలకు, శిశువులకు, ఆరోగ్యపరమైన సేవలు అందించడంతోపాటు, కరోనా సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్ గా, ఆశ వర్కర్లు చేసిన కషి కీలకమైంది అన్నారు. ఇటీవల కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు, ఆశ వర్కర్లకు కూడా, రోజుకు మూడుసార్లు ఫేస్ అటెండెన్స్ వేయాలని ప్రకటన చేయడం సరైనది కాదన్నారు.ఆశా వర్కర్లు గర్భవతులను, కాన్పుల నిమిత్తం హాస్పిటల్స్ తీసుకువెళ్లే క్రమంలో, ఫేస్ అటెండెన్స్ వేయలేని పరిస్థితి ఉంటుందని, టైమింగ్స్ లేకుండా విధులు నిర్వహించే ఆశ వర్కర్స్ కు ఫేస్ రీడింగ్ అటెండెన్స్ వర్తింపజేస్తే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆమె ఆరోపించారు.అలాగే నవంబర్ 15 నుండి డిసెంబర్ 5 వ తేదీ వరకు, లెప్రసీ సర్వే చేయమని అధికారులు చెప్పారు కానీ, సర్వేకు సంబంధించిన మెటీరియల్ పూర్తిస్థాయిలో కింద వరకు అందలేదని, కొన్నిచోట్ల సర్వేకు సంబంధించిన ఫారాలు ఆశ వర్కర్లే జిరాక్స్ తీయించుకోమని, చాక్ పీసులు మీరే కొనుక్కోవాలని చెప్పడం, ఇచ్చినచోట్ల కూడా అరాకొరగా అందించడం సరైనది కాదన్నారు.సర్వేకు సంబంధించిన బడ్జెట్ ను ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసిందని, సర్వే చేస్తున్న టీంకు, ఆశ వర్కర్ తో సహా ప్రభుత్వం ఇన్సెంటివ్ కేటాయించిందని, కానీ ఆచరణలో వాలంటీర్ కు మాత్రమే ఇన్సెంటివ్ ఇస్తామని ఆశ వర్కర్లకి ఇన్సెంటివ్ లేదని చెప్పడాన్ని ఆమె ప్రశ్నించారు.ఆశ వర్కర్ డ్యూటీ కి వెళ్లడానికి ముందు, వారి సంబంధిత సబ్ సెంటర్, సచివాలయాలకు వచ్చి, సంతకాలు చేయాలని, అనంతరం డ్యూటీ కి వెళ్లి మరలా తిరిగి వచ్చి సాయంత్రం నాలుగు గంటల వరకు కూర్చోబెట్టి పంపిస్తున్నారని, వ్యాక్సిన్ క్యారియర్లను తీసుకువెళ్లి తీసుకొచ్చే పని అప్ప చెప్పటం వలన, ప్రయాణ ఖర్చులకు వారి సొంత డబ్బులు పెట్టుకుని పని చేయాల్సి వస్తుందని, అలాగే ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లలో వాట్సాప్ ఇతర యాప్ లేవని, ఫీల్డ్ లోకి వెళ్లినప్పుడు ఆశ వర్కర్లు సొంత ఫోన్ల నుండి ఫోటోలు తీసి డిపార్ట్మెంట్ గ్రూపులకు ఫార్వర్డ్ చేయమని చెప్పటంతో పాటు, ఆశ వర్కర్లకు సంబంధం లేని పనులు అప్పజెప్పడం ఎంతవరకు సబబుని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన పని చేయని ఫోన్లను వెంటనే వెనక్కి తీసుకొని, రిపేర్ చేసి తిరిగి ఆశ వర్కర్లకు ఇవ్వాలని ఆమె కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా ఉపాధ్యక్షురాలు పి శ్రీలక్ష్మి, ఎస్ జోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

స్పందన అర్జీలు నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని, రీఓపెన్ అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లో డిఆర్ఒ స్పందన నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ అర్జీలు పరిష్కారంతో పాటు

అర్జీలను స్వీకరిస్తున్న డిఆర్ఒ వెంకటేశ్వర్లు

గ్రామదర్శిని సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తనిఖీలు చేయాలన్నారు. గుర్తించిన సమస్యలను అప్లోడ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ముడా విసి బి.నారాయణరెడ్డి, ఆర్డీఓ ఐ.కిషోర్, డ్వామా పీడీ జివి సూర్యనారాయణ, సిపిఒ వై.శ్రీలత, డిఎస్ఒ పార్వతి, డిపిఒ నాగేశ్వరనాయక్, డిఇఒ తాహెరా సుల్తానా, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కె.సరస్వతి, సర్వే ఏడి ఎస్.గోపాల్ రాజ్, చేనేత ఏడి ఎస్.రఘునంద, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎం వి ఎస్ రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వంతెన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

గుడ్లవల్లేరు మండలంలోని విన్నకోట దళితవాడ సమీపంలో వంతెన శిథిలావస్థకు చేరింది. విన్నకోట నుండి చంద్రాల వెళ్లే రహదారిలో పోలరాజ్ కెనాల్ పైన నిర్మించిన వంతెన శిథిలావస్థకు గురికావడంతో స్థానికులు, వాహనశోధకులు భయాందోళన చెందుతున్నారు. రైతులు పండిన ధాన్యాన్ని ఈ వంతెన ద్వారా గ్రామాలకు తరలించాల్సిన పరిస్థితి

ఉంది. వంతెన శిథిలావస్థకు చేరడంతో రైతులు ఆ ధాన్యాన్ని ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దీనిపై కొంతమంది రైతులు జిల్లా కలెక్టర్కు అర్జీ విన్నవించుకున్నట్లు తెలిపారు. వంతెన కృంగిపోక ముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గన్నవరం.

గన్నవరం మండలంలోని ఎస్సీ, బీసీ వసతిగృహాల్లో వసతులు హాస్టల్ చాలా దారుణంగా

తహశీల్దార్కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఉన్నాయనీ, సదుపాయాలు కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గన్నవరం తహశీల్దార్ నరసింహారావుకు వినతిపత్రం సమర్పించారు. ఎస్ఎఫ్ఐ గన్నవరం డివిజన్ కార్యదర్శి రాజేష్ మాట్లాడారు. నాడు-నేడు పథకం కింద వసతి గృహాలను అభివృద్ధి చేయాలని కోరారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టల్ నిర్మాణం పూర్తయి దాదాపు రెండేళ్లు గడిచినా ప్రారంభించకపోవటం దారుణమన్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన హాస్టల్ని ఎందుకు ప్రారంభించలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ ఎస్ఎఫ్ఐ నాయకులు గౌతమ్, వర్ధన్, సంజీవ్ పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే తప్పేంటి? : మద్దినేని

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం గ్రామ పంచాయతీలో జరుగుతున్న కోట్ల రూపాయల అవినీతిని ప్రశ్నించినందుకు మాకు కులం రంగు పులుముతారా? అని గన్నవరం ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్లు సూరం విజయలక్ష్మి, సగ్గుర్తి చంద్రికలు గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య తీరుపై మండిపడ్డారు. సోమవారం గన్నవరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మద్దినేని మాట్లాడారు. గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య నోరు తెరిస్తే నూటికి 95 సార్లు తాను ఎస్సీ మహిళలనీ, అందుకే ఓసీ సామాజిక తరగతికి చెందిన వారు పనికట్టుకుని తనను వేధిస్తున్నారని

మాట్లాడుతున్న మద్దినేని వెంకటేశ్వరరావు

చెప్పడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఇదే సౌజన్యకు సర్పంచి సీటు ఇచ్చి లక్షల రూపాయల డబ్బు ఇచ్చి గెలుపునకు దోహదపడింది ఓసికి చెందిన ఎమ్మెల్యే వంశీ కాదా?అని ప్రశ్నించారు. ఆయన చెప్పారని ఎస్సీ, బీసీలందరినీ కలుపుకొని ఓసీలంతా పనిచేసి నిన్ను గెలిపించింది నిజం కాదా? అన్నారు. ఎమ్మెల్యే కంటే తనకు గన్నవరంలో ఎక్కువ ఓట్లు వచ్చాయంటూ వంశీని కించపరిచేలా మాట్లాడింది నీవు కాదా? అప్పుడు కులం మర్చిపోయావా? అని ధ్వజమెత్తారు. పంచాయతీలో జరిగిన రూ.1.58 కోట్లను తిరిగి కట్టిస్తామని, అధికారులు స్పందించకుంటే కోర్టుకు వెళతామని ఆయన తెలిపారు. వార్డు మెంబర్ సూరం విజయలక్ష్మి మాట్లాడుతూ తెల్ల కాగితాలపై వార్డు మెంబర్లతో సంతకాలు పెట్టించుకున్న సౌజన్య వాటిని ఏం చేశారు?, వాటిపై ఏమి రాసి ఏ అధికారికి ఇచ్చారో తమకు తెలియదన్నారు. ఎస్సీలతో సహా వార్డు సభ్యులంతా సంవత్సరం ఆరు నెలలు పాటు సర్పంచికి సహకరించినప్పుడు కులం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సూరం విజయకుమార్ పాల్గొన్నారు.

బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

విధి , నిర్వహణలో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పబోవని కలెక్టర్ పి.రంజిత్ బాషా హెచ్చరించారు. సోమవారం తన బంగ్లాలో డ్వామా పీడీ, ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రాధాన్యతా భవన నిర్మాణాల పురోగతిపై మండలాల వారీగా టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిమెంట్, ఇసుక, స్టీల్ అందుబాటులో ఉన్నప్పటికీ భవన నిర్మాణాల పురోగతిలో అధికారులు వెనుకబడి ఉన్నారన్నారు. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు అధికారులు సాధించిన పురోగతిని పునఃపరిశీలించుకోవాలని, ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడం పట్ల అధికారుల పనితీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి 44 గ్రామ సచివాలయాలు, 120 రైతు భరోసా కేంద్రాలు, 99 వైయస్ఆర్ హెల్త్ క్లీనిక్లు ప్రారంభం కాని దశలో ఉన్నాయన్నారు. ఈ నిర్మాణాలను బేస్మెంట్ లెవెల్కు తీసుకురావాలన్నారు. ఎస్ఈ పీఆర్ ఈరాస్వామి కలెక్టర్ తోపాటు ఉన్నారు.

కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి-పెదపారుపూడి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పని కల్పించాలని ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి కోరారు. సోమవారం

సమావేశంలో మాట్లాడుతున్న సీతామహాలక్ష్మి

యలమర్రు గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ కొల్లూరి అనూష అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో పనులు గుర్తించి కూలీలకు కల్పించాలని కోరారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెలగల పద్మ, ఈఓ పి ఆర్ డి ఎం నాగిరెడ్డి, ఏపీవో నత్తా స్ఫూర్తి, విజయరాజు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బండి రామకృష్ణ ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం 36 డివిజన్లో మెదడుకు

నగదును అందజేస్తున్న బండి రామకృష్ణ

సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమ్మెట జగన్మోహననావు కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయాన్ని జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకష్ణ సోమవారం అందజేశారు. రాజుపేట మగ్గాలకాలనీలో తాపీపని చేసుకునే సమ్మెట జగన్మోహనరావుకు ఇటీవల మెదడుకు సంబంధించిన వ్యాధి సోకడంతో కుటుంబ సభ్యులు ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చేర్పించి వైద్య చికిత్స అందిస్తున్నారు. ఆ కుటుంబానికి స్థానిక జనసైనికుల సహకారంతో రామకృష్ణ రూ.20 వేలు ఆర్థిక సహాయం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గడ్డం రాజు,కర్రి మహేష్,రాజా, సత్తిబాబు, రమేష్, బాజీ, బాబి, సుదర్శన్, నరహరశెట్టి రాం జ్యోతి, స్థానిక జనసేన నాయకులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి : టిడిపి

ప్రజాశక్తి-పెదపారుపూడి

గుడివాడ మండలం బొమ్ములూరులో కళ్ళాల్లో ఆరబెట్టిన వరి ధాన్యపు రాశులను టిడిపి

ధాన్యాన్ని పరిశీలిస్తున్న రావి వెంకటేశ్వరరావు

మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులను రైతులు, టిడిపి నేతల దష్టికి తీసుకొచ్చారు. షరతుల్లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఆర్బికె కేంద్రం ముందు రైతులు చేసిన ఆందోళనలో టిడిపి నేతలు సంఘీభావంగా పాల్గొన్నారు.

నాగమల్లేశ్వరరావుకు సర్వేపల్లి జాతీయ అవార్డు

ప్రజాశక్తి-అవనిగడ్డ

హైదరాబాదులో ఆదివారం ఆల్ దా బెస్ట్ ఆర్ట్స్ అకాడమీలో జరిగిన విశిష్ట ప్రతిభా పురస్కారాల మహోత్సవంలో దివిసీమకు చెందిన మతి నాగమల్లేశ్వరరావుకు సర్వేపల్లి రాధాకృష్ణ

అవార్డును స్వీకరిస్తున్న నాగమల్లేశ్వరరావు

జాతీయ అవార్డును అందజేశారు. హైకోర్టు జడ్జి ఎస్.నంద, తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య, సంగీత నాటక అకాడమీ చైర్మన్ ఎస్పీ భారతి చేతుల మీదుగా అందజేశారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ అవార్డు 2022 తనకు రావటం పట్ల నాగమల్లేశ్వరరావు సంతోషం వ్యక్తంచేశారు. 2011లో వరుసగా పదో తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేసినందుకు జిల్లాస్థాయిలో అనుములు వెంకటప్పయ్య మెమోరియల్ అవార్డును కూడా అందుకున్నారని తెలిపారు.

మెను ప్రకారం భోజనం పెట్టాలి : డిఇఒ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

ప్రభుత్వం విద్యార్దులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో పాటశాలల్లో నూతన మెనూ అమలుకు మార్పు చేసిందని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా పేరొన్నారు. సోమవారం నుండి అమల్లోకి వచ్చిన నూతన మెనూ అమలుపై డిఇఒ తాహెరా సుల్తాన, ఉప విద్యాశాఖాధికారి యువి సుబ్బారావులు మచిలీపట్నంలోని రాంజీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీచేసి పలు సూచనలు చేశారు మచిలీపట్నం నగర పరిధిలోని స్థానిక వలందపాలెంలో ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ కార్యదర్శి ఎ.పద్మ సోమవారం పరిశీలించారు ఈ సందర్భంగా విద్యార్థులతో వసతి గృహంలో ఉన్న సదుపాయాలు భోజనం ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టిక, పలు రికార్డులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో సభ్యులు సిహెచ్ ముసలయ్య, అస్మిత అజ్మతున్నిసా,వార్డెన్ ఎం.అనిత ఉన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న ఎ.పద్మ

రుచిగా మధ్యాహ్న భోజనం : ఎంఇఒ

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం ఎంఇఒ బి.శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిమ్మగడ్డ రవీంద్ర భవాని, సిఆర్పి, ఎంఆర్సి, విద్యా కమిటీ, స్కూల్ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆ తర్వాత గన్నవరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని భవిత సెంటర్ ను సందర్శించి , జరుగుతున్న ఫిజియో థెరఫీని చూశారు. భవిత సిబ్బంది , శ్రీనివాస్ , ఇందిరా ప్రియదర్శి , ఎస్.రోజా పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం

ప్రజాశక్తి-చల్లపల్లి

రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ పోగ్రామ్ సత్ఫలితాలు ఇస్తోందని సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని మంగళాపురం పంచాయతీ ప్రాంగణంలో సర్పంచ్ సహకారంతో ఏర్పాటు చేసిన హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటరు, ఫ్యామిలీ ఫిజీషియన్ పోగ్రామ్ను సోమవారం ఆయన ప్రారంభించారు.వైద్యాధికారి డాక్టర్ కే.విజయరావు, 104 వైద్యులు డాక్టర్ పాండురంగారావు, హెల్త్ సూపర్ వైజర్ తోట సుధాకర్, హెల్త్ విజిటర్ స్వర్ణ కుమారి, హెల్త్ అసిస్టెంట్ వీ.రాంబాబు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ దినేష్, ఏఎన్ఎం నాగకుమారి, ఆశా వర్కర్లు వైద్య సేవలు అందించారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు గొరిపర్తి సురేష్, గ్రామ సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవల్లో భాగస్వాములు కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : రెడ్ క్రాస్ సేవల్లో జిల్లా అధికారులు భాగస్వాములు కావాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు, కలెక్టర్ యస్ ఢిల్లీ పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా జిల్లాలో ఉత్తమ సేవలు అందిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావును ఇటీవల జరిగిన రెడ్ క్రాస్ రాష్ట్ర సమావేశంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ బంగారు పతకం, ప్రశంసా పత్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య హాలులో రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ డా?సమరం, కార్యదర్శి డా? ఇళ్ళా రవి, ఇతర సిబ్బంది సోమవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి ఢిల్లీరావుని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా జిల్లాలో రక్తదానం, మొక్కలనాటడం వంటి కార్యక్రమాలే కాకుండా ఇ- వేస్టేజ్, మాదక ద్రవ్యాల వ్యసనం, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణం పరిరక్షణ, విపత్తుల నివారణ, ప్రథమ చికిత్స, ఆరోగ్య శిబిరాలు, ఉచిత శుక్లాల ఆపరేషన్లు వంటి కార్యక్రమాలను నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ప్రాథమిక విద్యాస్థాయిలో గుడ్- టచ్ బ్యాడ్- టచ్ , బాలికలు, మహిళలకు దిశ యాప్ పై అవగాహన కలిగించడం వంటి కార్యక్రమాలను

నిర్వహించడం అభినందనీయమన్నారు. అకస్మాత్తుగా గుండె ఆగిపోయినప్పుడు ఇంటిలో ఉన్నవారికి తక్షణం ఎలా స్పందించాలో నేర్పడానికి కాలేజీ యువతకి సిపిఆర్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ప్రతి ఒక్కరికి అవగాహన పెంపొందించడం గణనీయమైన కృషి అన్నారు. ప్రధానమంత్రి టిబి ముక్తి కార్యక్రమంలో భాగంగా కొన్ని వందల మందికి పౌష్టికాహారం నెలనెలా అందించే కార్యక్రమాన్ని చేపట్టడం శ్లాఘనీయమన్నారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి అధికారులు రెడ్ క్రాస్ సేవలో భాగస్వాములు అవ్వాలని విజ్ఞప్తి చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ సమరం మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ అందిస్తున్న సహకారం గణనీయమైందన్నారు.

కృత్రిమ కాళ్లు పంపిణీ

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్ : తాడిగడప వంద అడుగుల రోడ్డులోని అన్నే వారి కల్యాణమండపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ డాక్టర్ పొట్లూరి గంగాధరరావు మెమోరియల్ డిస్ట్రిక్ట్ సేవ మహోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హీల్ ప్యారడైజ్ సేవ సంస్థ సహకారంతో సుమారు 30 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు చిగురుపాటి వరప్రసాద్, లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ దామర్ల శ్రీశాంతి, హీల్ ప్యారడైజ్ సంస్థ సీఈఓ అజేయ్ మాట్లాడారు. కృత్రిమ కాళ్లు అవసరమైన వారు 8978528899 నెంబర్ ద్వారా సంప్రదించవచ్చునని సూచించారు.

పాస్టర్‌కు పోలీసుల కౌన్సెలింగ్

ప్రజాశక్తి - గన్నవరం : మనిషి ఏదో ఒక రోజు చనిపోతాడు.. కానీ తిరిగి రాడు.. ఈ విషయం చదువుకున్న మీకు తెలియదా? సమాధి లోంచి మూడు రోజులకు లేచి వస్తావా? జరగని పనులు చేస్తానంటూ గ్రామంలో అలజడి సృష్టిస్తావా ? ఏం తమాషాగా ఉందా? జైలుకు పంపిస్తా.. అంటూ గన్నవరం తహసీల్దార్ నరసింహారావు గొల్లనపల్లి గ్రామానికి చెందిన పాస్టర్ పులపాక నాగభూషణంను హెచ్చరించారు. పది రోజుల నుంచి గొల్లనపల్లి గ్రామంలో తాను చనిపోతానని మూడు రోజుల తర్వాత సమాధి నుంచి లేచి వస్తానంటూ ప్రచారం చేస్తూ అలజడి సృష్టిస్తున్న నాగభూషణం వ్యవహారం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వైరల్ అయింది. సోమవారం గన్నవరం తహసీల్దార్ నరసింహారావు పోలీసులు, రెవిన్యూ సిబ్బందిని పంపించి నాగభూషణంను రెవిన్యూ కార్యాలయానికి పిలిపించారు. గంటపాటు అతనితో మాట్లాడి అతని మానసిక పరిస్థితి సరిగా లేదని గుర్తించారు. దేవుడు అంటే ఒక నమ్మకం అంతే.. నీ ఇష్టం వచ్చినట్లుగా సమాజంలో ఎక్కడ జరగని విధమైన మాటలు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు. ఆ తర్వాత బయటకు వచ్చిన నాగభూషణం మీడియాతో మాట్లాడుతూ.. పాత కథనే మళ్లీ చెప్పాడు. ఇతన్ని మానసిక వైద్య నిపుణుల వద్దకు పంపాలని పోలీసులకు తహసీల్దార్ సూచించారు.

పరిశ్రమలకు కేటాయించిన భూములపై శ్వేతపత్రం

సిఎంకు సోము వీర్రాజు లేఖ

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో : ఎనిమిదేళ్లుగా రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కేటాయించిన భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సోమవారం సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. భూములు కేటాయించిన తర్వాత పరిశ్రమలు ఎందుకు ప్రారంభం కాలేదనే విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు సమీక్ష నిర్వహించలేదని పేర్కొన్నారు. ఇది అనేక అనుమానాలకు తావిస్తోందని లేఖలో పేర్కొన్నారు. జాకీ సంస్థ పరిశ్రమ ఏర్పాటు కాకుండా ఎందుకు వెనుతిరిగిందో తెలియజేయాలని పేర్కొన్నారు.

ఆర్‌టిసి సేవలను పరిశీలించిన జార్కండ్ బృందం

ప్రజాశక్తి-విజయవాడ : ఎపిఎస్ ఆర్‌టిసి ప్రయాణికులకు కల్పిస్తున్న సదుపాయాలు, ముఖ్యంగా విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నిర్వహణ తీరును సోమవారం జార్కండ్ రాష్ట్రం ట్రాన్స్‌పోర్టు విభాగానికి చెందిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల బృందం పరిశీలించింది. మూడు రోజుల స్టడీ టూర్‌లో భాగంగా వచ్చిన ఈ బృందంలో జార్కండ్ రాష్ట్రం ట్రాన్స్‌పోర్టు శాఖ జాయింట్ సెక్రటరీ బ్రిజేంద్ర హెమరాన్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (దుమ్కా ఆర్‌టిఎ ,సెక్రటరీ) జుగ్ను మిజ్, రాంచి జిల్లా ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ ప్రవీణ్ ప్రకాష్, గిరిదిహ్ మోటార్ వెహికల్ ఇనిస్పెక్టర్ ముకేష్‌కుమార్ ఉన్నారు. ఈ బృందానికి ఎపిఎస్ ఆర్టీసి

హెడ్డాఫీస్ సిటిఎం నాగేంద్రప్రసాద్, పిఎన్ బిఎస్ డిప్యూటీ సిటిఎం బషీర్ అహ్మద్, సిటిఎం బి శ్యామ్ ప్రసాద్ స్వాగతం పలికారు. తొలి రోజు పరిశీలనలో భాగంగా ఎపిఎస్‌ఆర్‌టిసి ప్రధాన కార్యాలయంతోపాటు ఆర్ఎం ఆఫీసు, స్థానిక పిఎన్ బస్‌స్టేషన్ విభాగాలను పరిశీలించారు. ఇక్కడ ప్రయాణికులకు అందిస్తున్న సేవలను వివరించారు.

మొదటి పేజీ తరువాయి

ప్రైవేటీకరణపై నిరసన

శిక్షణ ఇవ్వాల్సిందిపోయి డబ్బులు వసూలు చేయడం అన్యాయమని తెలిపారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము మాట్లాడుతూ ఎపిలో శాప్ అధికారులు క్రీడలను ఆదాయ వనరులుగా మార్చుకోవడం దుర్మార్గమన్నారు. క్రీడా మైదానాలను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించొద్దని అధికారులకు గతంలోనే అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. శాప్ ఎమ్‌డి, చైర్మన్ ఆదాయం కోసమే మైదానాలను ప్రయివేటుపరం చేస్తున్నట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. స్టేడియం చుట్టూ షాపింగ్ కాంప్లెక్సులు కట్టి ఆదాయం పెంచుకోవాలన్నారు. అంతేకాని క్రీడాకారుల నుండి డబ్బులు వసూలు చేసి శిక్షణ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. క్రీడాకారులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న శాప్ ఎమ్‌డిని తక్షణమే విధుల నుండి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు పి.కృష్ణ, కృష్ణకాంత్, బాజీ, ధనుష్, కిరణ్, జిల్లా నాయకులు సురేష్, మల్లేశ్వరరావు, సుధీర్, బాలాజీ పాల్గొన్నారు.

సిపిఎం నేతల పరామర్శ

అరెస్టయి విజయవాడ గుణదల పోలీస్‌స్టేషన్లో ఉన్న డివైఎఫ్ఐ నేతలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ క్రీడా మైదానాలు, ఆట స్థలాలు, క్రీడా కోర్టులను ఆదాయం కోసం ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయటం సిగ్గుచేటన్నారు. పే అండ్ ప్లే విధానం క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్నారు. క్రీడల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న యువజన నాయకుల అరెస్టు గర్హనీయమన్నారు. యువజన సంఘాల ఆందోళనకు మద్దతు తెలిపారు. అరెస్టు చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. క్రీడాస్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం, ఖజానా నింపుకోవడానికి పూనుకోవటాన్ని ఖండించారు. సంఘీభావం తెలిపిన వారిలో కెవిపిఎస్ నాయకులు జి.క్రాంతి కుమార్, స్థానిక సిపిఎం నేతలు పి.మురహరి తదితరులు ఉన్నారు.

మత్స్య సంపద పెంపు అందరి బాధ్యత

లైవ్‌ఫిష్ అమ్మక కేంద్రాల ఏర్పాటు వంటి పథకాలకు సబ్సిడీపై ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రూ.20 లక్షలతో ఇన్సులేటెడ్ వాహనాలు, ఐస్‌బాక్సులతో కూడిన టూ వీలర్, త్రీ వీలర్ మోటార్ సైకిళ్లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేసినట్లు తెలిపారు. మత్స్య సంపదకు మార్కెట్ సౌకర్యం కల్పించి మత్స్యకారుల ఆర్థిక భరోసాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ నేపథ్యంలోనే చేపల వినియోగం పెంపునకు ఫిష్ రిటైల్ అవుటెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో కృష్ణానది పరీవాహక ప్రాంతం ఉందన్నారు. ప్రకాశం బ్యారేజీ రిజర్వాయర్లో సుమారు 1400 మంది లైసెన్స్ కలిగిన మత్స్యకారులు చేపలను వేటాడుతున్నారని పేర్కొన్నారు. 85 మత్స్య సహకార సంఘాల ద్వారా 4,326 మంది సభ్యులు జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. ఈ ఏడాది కృష్ణానదిలో 15 లక్షల చేప పిల్లలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. వేట నిషేధ భృతి కింద జిల్లాలో 409 మంది మత్స్యకారులకు రూ.10 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. చేపల వేట చేస్తూ ప్రమాదవశాత్తూ మరణించిన ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెంకు చెందిన పి.వీర్రాజు, కృష్ణలంకకు చెందిన టి.వాసులకు మత్స్యకార బీమా రూ.10 లక్షల చొప్పున వారి కుటుంబ సభ్యులకు అందించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సెంట్రల్ ఎంఎల్ఏ మల్లాది విష్ణువర్ధన్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ శివరామకృష్ణ, జిల్లా మత్స్య శాఖాధికారి ఎ.నాగరాజా, పిఎంఎస్ ఆంకె గోవిందరాజులు, ఎడి సిహెచ్.చక్రాణి, ఎఫ్‌డిఒలు పి.అఖిల, బి.లెనిన్‌బాబు, వివిధ మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. మచిలీపట్నంలో నగరపాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ జరిగిన కార్యక్రమంలో కృష్ణాజిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ సముద్రపు చేపలు తినడం వల్ల ఎన్నోరకాల అనారోగ్యాలను తట్టుకునే శక్తి మనిషి శరీరానికి అందుతుందన్నారు. కృష్ణాజిల్లాలో మొత్తం 25 మండలాల్లోని 4 తీర ప్రాంత మండలాల్లో 111 కిలోమీటర్ల సముద్రతీరం ఉందన్నారు. మొత్తం 37,348 ఎకరాలలో మంచినీటి చేపల పెంపకం, 51,440 ఎకరాలలో ఉప్పునీటి చేపలు, రొయ్యల పెంపకం జరుగుతోందన్నారు. 2021-22 సంవత్సరానికి 13.76 లక్షల టన్నుల చేపలు, రొయ్యల ఉత్పత్తి జరిగినందుకుగాను రూ.17527.07 కోట్ల బివివి వచ్చిందన్నారు. జిల్లాలో 2022-23లో వేట నిషేధ భృతి క్రింద 11,850 మందిని అర్హులుగా ప్రతిపాదించగా, వైఎస్ఆర్ మత్స్యకార భరోసా ద్వారా మొదటి విడతలో 9,940 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ప్రభుత్వం జమ చేసిందన్నారు. జడ్‌పి చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బిసిలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ రాష్ట్రానికి ఆక్వా పరిశ్రమ అక్షయ పాత్ర వంటిదన్నారు. జిల్లా మత్స్య సహకార సొసైటీ అధ్యక్షులు చింతా గోవిందరాజులు మాట్లాడుతూ శాస్త్రవేత్తలకు, మత్స్యకారులకు మధ్య విజ్ఞాన, సాంకేతికత విషయాల్లో పరస్పర సహకారం ఎంతో అవసరమన్నారు. ఈకార్యక్రమంలో మచిలీపట్నం డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు ఎన్.శ్రీనివాసరావు, బందరు ఆర్‌డిఒ ఐ.కిషోర్, 20వ డివిజన్ కార్పొరేటర్ తిరుమలశెట్టి ప్రసాద్, మున్సిపల్ కో- ఆప్షన్ సభ్యులు మట్టా తులసమ్మ, పలువురు ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారులు, జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, తిరువూరు మండలం, చిక్కుళ్లగూడెం కాపురస్తులు మందడపు సత్యనారాయణ గారి కుమారులు దేవేంద్ర, చంద్రశేఖర్ అను మాకు తిరువూరు మండలం, గానుగపాడు రెవెన్యూ గ్రామంలో ఆర్ ఎస్ నెం.603 దాఖలా యం.3.78 సెంట్లు మెరక భూమి ఉన్నది. సదరు భూమిని లోగడ మేము ఇరువురుము జాయింటుగా కలిసి కటికల దుర్గ గారి వల్ల ది.12-06-2006వ తేదీన వ్రాయించుకోబడి తిరువూరు స.రి. ఆలో 1వ పుస్తకము ద.నెం.1730 రు గా రిజిష్ట్రీ కాబడిన విక్రయ దస్తావేజు రీత్యా మాకు సంక్రమించివున్నది. ఇట్లుండగా సదరు దస్తావేజును ఫొటోస్టాట్ తీయించుకునే నిమిత్తం ది.11-11-2022వ తేదీన తిరువూరు పట్టణం వెళ్లి ఫొటోస్టాట్ తీయించుకుని తిరిగి ఇంటికెళ్లుచుండగా దస్తావేజు మార్గమధ్యలో ఎచ్చటనో పోయినది. వెంటనే చుట్టుపక్కల విచారించి నను కనిపించలేదు. సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు

ఇట్లు
మందడపు దేవేంద్ర, చంద్రశేఖర్
సెల్. 9989951149

ప్రకటన

మహారాజశ్రీ అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి కోర్టువారి సముఖమునకు

ఐ.పి.నెం.3/2017

బిట్వీన్:
యలవర్తి నటరాజ్ ...పిటీషనరు/క్రెడిటార్
మరియు
1)గంగు వెంకటకృష్ణ పాండురంగారావు
2)రేపల్లె కుసుమ ...రెస్పాండెంట్స్
టు
1వ రెస్పాండెంట్/డెబిటార్:
గంగు వెంకటకృష్ణ పాండురంగారావు
తండ్రి రాఘవయ్య, హిందూ, వయస్సు 55 సం॥లు, డోరు నెం.1-456, అవనిగడ్డ అవనిగడ్డ మండలము, కృష్ణాజిల్లా.
ప్రస్తుతం:- డోరు నెం.18-8-192/3/10, ఇంద్రానగర్ సైదాబాద్, హైదరాబాద్-500059.

పై నెంబరు ఇన్‌సాల్‌వెన్సీ పిటీషనులో 1వ రెస్పాండెంట్/డెబిటార్ అయిన మీకు శ్రీ కోర్టువారి ఉత్తర్వు ననుసరించి ఈ ప్రకటన ద్వారా నోటీసు అమలు పరచటమైనది. వాయిదా ది.05-12-2022 తేది ఉదయం గం.10-30ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గానీ లేక అడ్వొకేటు ద్వారా గానీ హాజరై మీ సమాధానము శ్రీ కోర్టువారికి తెలియజేయవలెను. లేని యెడల మీ పరోక్షమున కేసు విచారించబడునని తెలియజేయుచున్నాను.
అవనిగడ్డ
ది.19-11-2022.

ఇట్లు
గొల్తి గౌరీశంకర్,
పిటీషనర్ తరుపు అడ్వొకేటు

ప్రకటన

మహారాజశ్రీ విజయవాడ 3 వ సీనియర్ సివిల్ కోర్టులో

I.A. No. 396/2022
And
I.A. No.397/2022 in O.S NO. 615/2018

Between:-
B. Tulasi Naik and another ...Plaintiffs
AND
Cherukuru Sujatha and 4 Others
... Respondents

మూడవ **Respondent :**
Maddali Prameela W/o Venkateswara Rao, Hindu, aged about 64 years, Now Residing at R/o Sudhakar, Harijanawada, Gollapudi, Vijayawada Rural Mandal, Krishna District.

నాల్గవ **Respondent :**
Maddali Raghu S/o Venkateswara Rao, Hindu, aged about 30 years, Now Residing at R/o Sudhakar, Harijanawada, Gollapudi, Vijayawada Rural Mandal, Krishna District.

ఐదవ **Respondent :**
Banavathu Triveni, D/o. Late Tulasi Naik, Hindu, aged about 39 years, Resident of D.No.11-15-DC/SH-1/102, Flat No.102, Shyam Heights, Doctors Colony, Kothapeta, Saroornagar, K.V. Ranga Reddy District.

పై నెంబర్ లో మూడవ, నాల్గవ మరియు ఐదవ Respondents, ది. 09-12-2022 తేదీన ఉదయం 10-30 గంటలకు పై కోర్టు లో హాజరై తమ ఏ విధమైన ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో పరోక్షముగా తీర్మానించెదరు.

కోర్టు వారి అనుమతితో
వాయిదా:09-12-2022

ఇట్లు
తుమ్మల వెంకటదాస్,
పిటీషనర్ తరపు న్యాయవాది,
విజయవాడ.

ప్రకటన

మహారాజశ్రీ 1వ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు, విజయవాడ

E.A. No. 138,139 &140/2022 in
E.P. No. 47/2021 in O.S. No. 561/2018

బిట్వీన్:
ఆళ్ళగడ్డ గనేశ్వరీదేవి .... పిటీషనర్
మరియు
యస్.పి. జ్యూయలర్స్ & ఇతరులు .... రెస్పాండెంట్స్
టు :
1. శేగు నాగమణి, భర్త : కీ॥ వేంకటేశ్వరరావు
2. శేగు దివ్యజ్యోతి, తండ్రి : కీ॥ వేంకటేశ్వరరావు
3. శేగు అఖిల్, తండ్రి : కీ॥ వేంకటేశ్వరరావు

డోర్ నెం.21-10/3-113, శ్రీనగర్ కాలనీ, 3వలైను, సత్యనారాయణపురం, విజయవాడ-11.

పై నెంబరు ఇ.పి.ని పిటీషనర్ మీ మీద విజయవాడ 1వ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు నందు దాఖలు చేసియున్నారు. ఈ పిటీషన్లలో మీకు నోటీసులు పంపిననూ తీసుకోక కాలయాపన చేయుచుండుట వల్ల శ్రీ కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసులు జారీ చేసియున్నారు. కావున ది. 30-11-2022న మీరు స్వయంగా గానీ, లేక మీ ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై మీ సమాధానం తెలియజేసు కోవలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడును. కావున తెలియజేయు చున్నాను.
వాయిదాతేది: 30-11-2022

శ్రీ యన్.చలపతిరావు,
శ్రీ పి.గోపాలకృష్ణ,
విజయవాడ. **న్యాయవాదులు, విజయవాడ.**
తేది:21-11-2022 **సెల్: 9032041242**

సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యత : వంశీ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

రాష్ట్రప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందనీ, పలు సంక్షేమ పథకాల ద్వారా అందరికీ లబ్ధి చేకూర్చటానికి కృషి చేస్తున్నామని గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ అన్నారు. బాపులపాడు మండలంలోని వీరవల్లి గ్రామ సచివాలయం1 పరిధిలో ఏర్పాటు చేసిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వైసిపి గ్రామ కన్వీనర్ గూడవల్లి రత్న సుధాకర్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కలిసి ప్రతి గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే వంశీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పట్ల గ్రామ ప్రజలు సంతప్తిగా ఉన్నారని చెప్పారు. ఫించన్లు ,ఇళ్ల స్థలాల కోసం ఎమ్మెల్యే వంశీమోహన్ కి పలువురు విజ్ఞప్తి చేశారు. వెంటనే అధికారులతో మాట్లాడి సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని ఆదేశించారు. మలివిడత జాబితాలో ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులకు , ఉన్నత విద్య అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. అనంతరం మండల స్థాయి అధికారులు,

క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీ

గ్రామ సచివాలయ సిబ్బందితో ప్రజల విజ్ఞప్తులు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. గ్రామ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమైయ్యారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నక్కా గాంధీ, కన్వీనర్ అవిర్నేని శేషగిరిరావు, బాపులపాడు ఎంపీపీ నగేష్ , జడ్పీటిసి గంగాభావానీ ఉంగుటూరు ఎంపీపీ వడ్లమూడి సరోజని , గన్నవరం జడ్పిటిసి ఎలిజిబెత్ రాణీ, తహశీల్దార్ మల్లికార్జునరావు, ఎంపిడిఒ ప్రభాకరరావు, వీరవల్లి సర్పంచ్ పిల్లా అనిత, మాజీ సర్పంచ్ నందమూరి కృష్ణప్రసాద్, గ్రామ కన్వీనర్ గూడవల్లి రత్న సుధాకర్, వైసీపీ జిల్లా కార్యదర్శి కోడేబోయన బాబీ, అత్మూరి బాలాజీ, పిఏసీఎస్ ఛైర్ పర్సన్ అల్లాడి థెరిసా, ఎంపిటిసి దూసరి నిర్మల, మహిళ విభాగం జిల్లా ఉపాధ్యక్షరాలు రాయి శివపార్వతి, మండల ఎస్సీ సెల్ నాయకులు తోమ్మండ్రు రమేష్, మోర్ల ఆంజనేయులు, బొడ్డు శ్రీధర్, గండి చిన్నారావు, రాయి గోపాలకృష్ణ, రాయి ప్రభుకుమార్, లంక జగన్మోహనరావు, పిల్లా నాగరాజు, చాంద్ర బుజ్జి, మావులూరి యోహను, మావులూరి రాజశేఖర్, కాటమాల పండు, మావులూరి సాయిబాబు, కృష్ణమోహన్, తలారి ఏసుపాదం, బొడ్డు యోహను, దూసరి సుధీర్, ఉంగుటూరు మండల కన్వీనర్ వింత శంకరరెడ్డి, తిప్పనగుంట పిఏసీఎస్ మూల్పూరి ప్రభుకాంత్, సర్పంచులు కాకాని సంజయ్, అర్నేపల్లి వర్మ ,కలపాల భీమయ్య, చిన్నాల సత్యగణేష్, ఎంపిటిసి చందు రామదేవి శ్రీనివాసరావు, వెలగపల్లి ప్రదీప్, రంగన్నగూడెం పిఏసీఎస్ అధ్యక్షుడు కసుకుర్తి శ్రీనివాసరావు, వెంకటరత్నం పంచాయతీ కార్యదర్శి శ్యామలరావు, వీఆర్వో శేఖర్, వెలుగు సిసి కమల , గ్రామ సచివాయలం సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడీ , వివోఏలు, అశా కార్యకర్తలు గ్రామపరిధిలో అన్ని విభాగాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా సాయం అందజేత

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు గ్రామ పంచాయితీ లోని 2 వ సచివాలయం పరిధిలోని ముందడుగు గ్రామంలో

నగదును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు అధికారులు

కోడూరు చంటి ఇటీవల కాలంలో మృతి చెందారు. వైఎస్సార్ భీమా రూ.1 లక్ష మంజూరయ్యింది. వాటిలో రూ.10 వేలు తక్షణ సహాయంగా కోడూరు చంటి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోడూరు పిఏసిఎస్ అధ్యక్షులు పరిసే మాధవరావు, 8వ వర్డ్ మెంబర్ వెన్న ప్రసాద్, 10 వవార్డు మెంబర్ మెండు.అర్జునరావు, ఎం.పి.టి.సి లు బడే హేమ గంగాధర్, తిమ్మన నాంచారయ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ మరియు స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మోపిదేవిలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-మోపిదేవి.

మండల పరిధిలోని కోసూరు వారి పాలెం వద్ద

కృష్ణానది నీటిపాయల మధ్యన ఇసుక తెన్నెలలో స్వయంభూ గా వెలసిన బాల శివ శంకర్ భగవాన్ ఆలయం వద్ద సోమవారం కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో బాల శివ శంకర్ భగవాన్ ఆలయ ట్రస్టీ గుడిసేవ విజయ లక్ష్మి ఆధ్వర్యంలో కార్తీక పూజలు చేశారు. సుమారు 2000 మందికి పైగా భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. మోపిదేవి మండలానికి చెందిన కోసూరు వారిపాలేనికి భక్తులు పాల్గొన్నారు.

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

అవనిగడ్డలో

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆక్వా కల్చర్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.శాంతకుమారి అధ్యక్షత వహించారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం మత్స్యశాఖ విభాగ శాస్త్రవేత్త జె యశ్వంత్ కుమార్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆక్వా కల్చర్ విభాగాధిపతి జయసాయి, రసాయనిక శాస్త్ర విభాగ అధిపతి కె.సుజాత, అధ్యాపకులు నాగమణి, తనుజ తదితరులు పాల్గొన్నారు. అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపాల్ డి.ఉమారాణి ప్రశంసించారు. **కోడూరు :** మత్స్యకారుల అభివద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కోడూరు మండలం ఉల్లిపాలెం గ్రామంలోని యానాదులు, మత్స్యకారులను ఇద్దరిని ప్రభుత్వ అధికారులు గుర్తించి 60 శాతం సబ్సిడీతో కృష్ణా నదిలో కేజ్ పండు కప్పల (చేపలు) పెంపకానికి సంబంధించి పండుగప్ప పిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో ఉల్లిపాలెం పిఎసిఎస్ చైర్మన్ కటకం కుటుంబరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా రైతు విభాగ కార్యదర్శి కొండవీటి వెంకటనారాయణరావు, ఉల్లిపాలెం నాయకులు వెర్రి శ్రీనివాసరావు, మత్స్య శాఖ సహాయ సంచాలకులు సిహెచ్ వెంకటేశ్వరరావు, మత్స్య శాఖ అభివద్ధి అధికారి వానపల్లి సత్యనారాయణ, సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్స్ పెద్ద సంఖ్యలో యానాదులు పాల్గొన్నారు.

కోడూరులో

ఇసుక తోలకాన్ని నిలిపేయాలని వినతి

ప్రజాశక్తి-అవనిగడ్డ

మండల పరిధిలోని పాతఎడ్ల లంక పుష్కర ఘాట్లో ఎడ్లబండ్లతో ఇసుకత్వాలకం నిలిపివేయాలని కోరుతూ గ్రామస్తులు స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించారు. సోమవారం ఆ గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని వినతి పత్రం అందజేశారు. పిండ ప్రధానం చేసే చోట సహజసిద్ధంగా ఏర్పడిన ఇసుకను పలువురు ఎడ్ల బండిలతో తరలించడానికి నిలిపివేయాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్ కేసరికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏసీబీఎస్ఐ మహమ్మదాలీకి కూడా వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భర్త పాలెపు దుర్గారావు, వార్డ్ మెంబర్ పెమ్మాడి వెంకన్న, గ్రామస్తులు చెక్కా సత్యనారాయణ, కొల్లు నాగరాజు, గోవా గోవర్ధన్, మైల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఎపి ఎన్‌జిఓస్ గన్నవరం నూతన కార్యవర్గం

గన్నవరం : ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ గన్నవరం ఎన్నికలలో వి. సాంబశివరావు, వి.వంశీ మోహన్ కష్ణ ప్యానల్ సభ్యులు విజయం సాధించారని ఎన్నికల అధికారి యం రాజుబాబు సోమవారం తెలిపారు. స్థానిక ఏపీ ఎన్జీవోస్ హోంలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి యం రాజుబాబు మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నామినేషన్లు స్వీకరించామన్నారు. 11 పదవులకు గాని, 11 నామినేషన్లు రావడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యిందన్నారు. అధ్యక్షుడుగా వి సాంబశివరావు(వైద్య ఆరోగ్యశాఖ), కార్యదర్శిగా వి.వంశీ మోహన్ కృష్ణ (పంచాయతీరాజ్ శాఖ), కోశాధికారిగా ఎం రవి(ఖజానా శాఖ),, సహాధ్యక్షుడిగా టివి నాంచారయ్య (పంచాయతీరాజ్ శాఖ), ఉపాధ్యక్షులుగా పి సురేందర్ (వైద్య ఆరోగ్యశాఖ) ఎ సునీల్ కుమార్(రెవిన్యూ శాఖ), ఎస్ శ్రీనివాస్(పశుసంవర్ధక శాఖ),సంయుక్త కార్యదర్శులుగా సి.వి.ఎల్.ఎస్.ఆర్.వి ప్రసాద్ (పంచాయతీరాజ్ శాఖ), జి.చంద్రశేఖరరావు (వైద్య ఆరోగ్యశాఖ), ఎ.సాల్మన్ రాజు (బీసీ వెల్ఫేర్ శాఖ), మహిళ సంయుక్త కార్యదర్శిగా కె.సూర్యకళ (రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, జిల్లా కార్యదర్శి ఎండి ఇక్బాల్ అభినందనలు తెలిపారు.

28న హుండీ లెక్కింపు

గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలోని శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపును ఈనెల 28న నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్‌బాబు తెలిపారు. అమ్మవారి హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు డిపార్ట్మెంట్ అధికారుల సమక్షంలో ఆలయ మండపంలో లెక్కించనున్నట్లు తెలిపారు.

నేడు మెగా పశువైద్య శిబిరం

గుడ్లవల్లేరు : మండలంలోని కౌతవరం గ్రామంలో మెగా పశు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు, పశు సంవర్ధక శాఖ గుడ్లవల్లేరు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే ఈ శిబిరానికి చుట్టుపక్కల గ్రామాల పశు పోషకులందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ప్రింటర్ బహూకరణ

చల్లపల్లి : ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ సేవల అభినందనీయమని తహశీల్దార్ కె.గోపాలకృష్ణ అన్నారు.

ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ పురిటిగడ్డ సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ తహశీల్దార్ కార్యాలయానికి రూ.30 వేలు విలువ కలిగిన నూతన ప్రింటర్ సోమవారం బహూకరించారు. తహశీల్దార్ మాట్లాడుతూ గతంలో ఆలయానికి నూతన ఇన్వర్టర్ అందించాలన్నారు. విలేజ్ రెవెన్యూ అధికారుల భవన నిర్మాణం, కోవిడ్ సమయంలో అన్ని శాఖలకు ఎన్-95 మాస్కులు, శానిటైజర్లు, ఫేస్ షీల్డ్స్, గ్లౌజులు అందచేశారని వివరించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఘంటసాల కృష్ణమోహన్, జూనియర్ అసిస్టెంట్ ఉదయ్ ప్రభు పాల్గొన్నారు.

కీడాకారులకు వంశీ అభినందన

హనుమాన్ జంక్షన్ : బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక గన్నవరం శాసనసభ్యులు డా. వల్లభనేని వంశీ మోహన్ ప్రతి ఇంటిని సందర్శించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ పేదలకు ఎలా సమకూరుతున్నాయని విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. గత మూడు రోజులుగా నున్న వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో జరిగిన సీనియర్ పురుషుల, మహిళల రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో సత్తా చాటిన కృష్ణాజిల్లా క్రీడాకారులను ఘనంగా అభినందించారు. జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ జి.విజయకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆర్.అశోక్ కుమార్,బి. భాగ్యరాజు, సరళ, సీనియర్ క్రీడాకారులు

స్విమ్మింగ్ విజేతలకు అభినందన

ప్రజాశక్తి-విజయవాడ: జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించిన వారిని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అభినందించారు. అస్సాం రాష్ట్ర రాజధాని గౌహతిలో ఈ నెల 11 నుండి 13వ తేదీ వరకు జరిగిన పారా జాతీయ స్విమ్మింగ్ పోటీలలో వికలాంగుల విభాగంలో 15 పతకాలు విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన వారికి వచ్చాయి. వీటిలో గోల్డ్ 10, వెండి 5 పతకాలు వచ్చాయి. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కమిషనర్, డైరెక్టర్ అఫ్ స్పోర్ట్స్ టి.శ్రీనివాస్ స్విమ్మింగ్ పూల్ కోచ్ ఎ.లక్ష్మణరావు, విజేతలను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి నగరానికి మణిహారంగా నిలవాలని ఆకాంక్షించారు.

ఎక్సెల్‌ప్లాంట్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. ఎక్సెల్‌ప్లాంట్‌లో జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఎక్సెల్ ప్లాంట్ ఆవరణలోని ఎంట్రన్స్ గేట్లు, శానిటరీ ఆఫీసు బిల్డింగ్, స్టోర్ రూమ్, డ్రైవర్స్ టాయిలెట్స్(రెస్ట్ రూమ్) నిర్మాణం పనుల గురించి పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఆవరణలో జరుగుతున్న రోడ్ల పనులను 15 రోజుల్లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

విఎంసి స్పందనకు 15 అర్జీలు

ప్రజల నుంచి వస్తున్న అర్జీల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. స్పందనలో ప్రజలు

పెట్టుకున్న అర్జీలను మరొకసారి పునరావృతం కాకుండా తక్షణమే పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని కమిషనర్ పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగంనకు సంబంధించి మూడు, ఇంజనీరింగ్ విభాగంనకు సంబంధించి మూడు అర్జీలు, పబ్లిక్ హెల్త్ విభాగం ఒకటి, యుసిడి నాలుగు, రెవెన్యూ-రెండు, ఎస్టేట్ రెండు అర్జీలు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. ఆయా సర్కిల్స్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 4 అర్జీలు వచ్చాయి.

చెస్ పోటీల్లో 'రాకేష్' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక కెఎల్‌రావునగర్‌లో గల రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని సోనిక చెస్ పోటీల్లో పాల్గొని తన ప్రతిభను కనబర్చింది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎన్.వి.రావు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన విజయవాడలో గ్లోబల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన చెస్ పోటీల్లో 13 జిల్లాల నుంచి 270 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీలు ఏడు రౌండ్లుగా జరిగాయని, ఫైనల్స్‌లో రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి సోనిక చెస్ పోటీల్లో తతీయ బహుమతి సాధించిందని తెలిపారు. ఈ బహుమతిని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా చేతుల మీదుగా అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సోనికాను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. స్కూల్ కో-ఆర్డినేటర్ కె. రమేష్ మాట్లాడుతూ అనేక ఉన్నతమైనటువంటి బహుమతులు పొందాలని గర్వించే అంత విజేతగా నిలబడాలని అన్నారు. జి మల్లేశ్వరి మాట్లాడుతూ సోనికాను మిగతా విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎవరికి ఇష్టమైన రంగాల్లో వారు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాధిక, కల్పన తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో తనిఖీలు

ప్రజాశక్తి-కంచికచర్ల: పెట్రోల్ బంకుల్లో ఆయిల్ కల్తీ, కొలతల్లో అక్రమాలకు పాల్పడితే ఆ బంక్ లు సీజ్ చేసి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ వి రాజకుమారి హెచ్చరించారు. ఇటీవల కంచికచర్ల సమీపంలో గల ఓ పెట్రోల్ బంకు వినియోగదారులు నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఆమె రెవిన్యూ, పౌరసరఫరాల శాఖ సిబ్బంది తో బంక్ లో తనిఖీ లు చేశారు. పంపుల నుండి వచ్చే ఆయిల్ ను క్వారీలో కంట్రోల్ సిబ్బంది తో కలిసి తనిఖీ లు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ కల్తీ కాకుండా చూడాలన్నారు. తూనికలు, కొలతల్లో తేడాలు వచ్చినట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడియస్ డిటి ఇస్మాయిల్, ఆర్ ఐ శిరీష, విఆర్వో, అనూష తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్లలో పెట్రోల్ బంక్ తనిఖీ చేస్తున్న అధికారులు

23న కెబిఎన్‌లో పోటీలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: కాకరపర్తి భావనారాయణ కళాశాల డిబేటింగ్ అండ్ క్విజ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన 42వ రాష్ట్రస్థాయి సారస్వత పోటీలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. పోటీల్లో భాగంగా డిబేటింగ్, వక్తత్వం, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలకు వేరువేరుగా పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు రోలింగ్ షిల్డ్‌లతో పాటు వ్యక్తిగత బహుమతులు, బంగారు, వెండి పతకాలు అందించనున్నట్లు తెలిపారు.

పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో కౌలురైతు సంఘం 3వ రాష్ట్ర మహాసభ చిత్రమాలిక

అమరుల స్తూపం వద్ద విజూకృష్ణన్ నివాళి

ప్రారంభ సభలో మాట్లాడుతున్న మానుకొండ ఉపేంద్ర, వి.వెంకటేశ్వర్లు, ముజఫర్ అహ్మద్, ఎం.హరిబాబు

ధాన్యం కొనుగోలుపై తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న రాజశేఖర్, బలపరుస్తున్న బి.శ్రీనివాసరావు

అమరుల స్తూపం వద్ద వి.శ్రీనివాసరావు నివాళి

సంఘం జెండా ఆవిష్కరణ

మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

చేబ్రోలు భాస్కరరావు, తేళ్ల నారాయణ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ర్యాలీ ప్రారంభానికి ముందు డప్పుల మోత..

ప్రతినిధుల నమోదు

విజూకృష్ణన్, లక్ష్మణరావు మాటామంతి..

బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న విజూకృష్ణన్

తీర్మానానికి ఆమోదం తెలుపుతున్న ప్రతినిధులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట, పల్నాడు జిల్లా

ప్రజానాట్య మండలి కళాకారుల గేయాలాపన

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.